రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- విశ్వనాథపల్లిలో ఆర్‌బీకే నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. విశ్వనాథపల్లి గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించనున్న రైతు భరోసా కేంద్రానికి రమేష్‌బాబు బుధవారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తూ వారికి అండగా నిలిచిందని చెప్పారు. ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభానికి ముందే ప్రతి సంవత్సరం రైతుల ఖాతాల్లో వైఎస్సార్‌ రైతు భరోసా నగదును ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. గ్రామ స్థాయిలో రైతులందరికీ సేవలందించాలనే లక్ష్యంతో ఆర్‌బీకే వ్యవస్థకు శ్రీకారం చుట్టారని, ఈ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఆర్‌బీకేల ద్వారా అన్నదాతలకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సరఫరా చేస్తారని రమేష్‌బాబు వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ టెక్నాలజీకి అనుగుణంగా సాగు విధానాలను వివరిస్తారని, వీటిని అన్నదాతలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యానికి కూడా మంచి ధర లభిస్తోందని, ఇందంతా దళారీ వ్యవస్థను నిర్మూలించడం వల్లే సాధ్యమయిందన్నారు. ఈ ఏడాది రైతు భరోసాకి అర్హుల వివరాలను సచివాలయాల వద్ద పొందుపర్చారని, రైతులు వాటిని పరిశీలించి సమస్యలు ఉంటే అక్కడ సిబ్బందికి తెలపాలన్నారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీడీఓ పాండురంగారావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇంకొల్లు మురళీకృష్ణ, పీఏసీఎస్‌ చైర్‌పర్సన్‌ తోట నాంచారమ్మ, సర్పంచి యలవర్తి నాంచారయ్య, వైస్‌ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ఎస్సీ సెల్‌ కన్వీనర్‌ వెన్నా ప్రసాద్‌, రైతు సంఘ నేత రేపల్లె రాజయ్య పాల్గొన్నారు.

తీరప్రాంత గ్రామాల్లో అధికారుల పర్యటన



హంసలదీవిలో కుళాయి నీటిని పరిశీలిస్తున్న అధికారులు

కోడూరు: మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో మండల పరిషత్‌, పంచాయతీ అధికారులు బుధవారం పర్యటించారు. మంగళవారం జరిగిన మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని ఎంపీడీఓ పాండురంగరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి హంసలదీవి, పాలకాయతిప్ప, జరుగువానిపాలెం, మందపాకల, దింటిమెరక గ్రామాల్లో పర్యటించారు. తాగునీటి సమస్య అధికంగా ఉందంటూ ప్రజాప్రతినిధులు చెప్పడంతో ఆయా గ్రామాల్లోని అన్ని రక్షిత మంచినీటి చెరువులను, ఫిల్టర్‌ బెడ్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు అనుసరించాల్సిన చర్యలపై చర్చించారు. మౌలిక వసతుల కల్పనకు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌, మండల పరిషత్‌ నుంచి అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. హంసలదీవిలో నూతన ఓవర్‌ హెడ్‌ ట్యాంక్‌ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈఓపీఆర్డీ యలవర్తి సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ ప్రకాష్‌, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో రాణించాలి

కంకిపాడు: పోటీ పరీక్షల్లో రాణించాలని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్‌.సునీత అన్నారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గణితం, స్పోకెన్‌ ఇంగ్లిష్‌, ఇతర అంశాలపై పోటీ పరీక్ష నిర్వహించారు. న్యూనతా భావాన్ని విడనాడి పోటీ పరీక్షల్లో రాణించేలా సన్నద్ధం కావాలని సూచించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం నిర్వహించారు. గ్రంథాలయాధికారి సిహెచ్‌ రామకృష్ణ పర్యవేక్షించారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు శిక్షణ



ఈడేపల్లి గ్రంథాలయంలో పేపర్‌ క్రాఫ్ట్‌ బొమ్మలను చూపుతున్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్‌: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా నగరంలోని పలు గ్రంథాలయాల్లో బుధవారం విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉపాధ్యాయిని విజయ విద్యార్థులకు భగవద్గీతలోని 13వ అధ్యాయంలో 28వ శ్లోకం నేర్పించి తాత్పర్యం వివరించారు. కోలాటం, నృత్యాలు నేర్పించారు. అనంతరం జనరల్‌ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయిని జి.దుర్గ విద్యార్థులకు లెక్కల్లో శిక్షణ ఇచ్చారు. చెస్‌ ఆడించారు. సరస్వతి ప్రార్థనతో ప్రారంభించి శ్లోకాలు చదివించి కథలు చెప్పారు. ఈడేపల్లి గ్రంథాలయంలో నీతి కథలను చెప్పి డ్రాయింగ్‌ నేర్పించారు. పేపర్‌ క్రాఫ్ట్‌ బొమ్మల తయారీ నేర్పించారు. మురళీ కోలాటం నేర్పించి క్యారమ్స్‌, చెస్‌, లూడో తదితర ఆటలు ఆడించారు. ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్‌, ఈడేపల్లి శాఖా గ్రంథాలయం నిర్వాహకురాలు వెంకటేశ్వరమ్మ పర్యవేక్షించారు.

పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం



తోట్లవల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్‌ సాయిప్రసన్న, సిబ్బంది



పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్న వైద్యులు, నర్సులు

తోట్లవల్లూరు: పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరమని, దానికి దూరంగా ఉండాలని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ సాయిప్రసన్న సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన తోట్లవల్లూరులో ఆరోగ్య సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు శరీరంలోని అన్ని అవయవాలను నాశనం చేస్తుందని డాక్టర్‌ సాయిప్రసన్న తెలియజేశారు. పొగాకు వలన గుండె, ఊపిరితిత్తుల సమస్యలు రావటంతో పాటు క్యాన్సర్‌ వ్యాధికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యంగా జీవించాలన్నారు. డాక్టర్‌ మాధవి, సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ మాణిక్యం, పీహెచ్‌ఎన్‌ పద్మావతి, హెచ్‌వీ రోహిణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడటౌన్‌: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. పొగాకు, పొగాకు ఉత్పత్తులు వాడటం వలన మనిషి తన జీవితాన్ని కోల్పోతాడని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎస్‌.ఇందిరాదేవి అన్నారు. ఆసుపత్రి వైద్యులు, ఉద్యోగులు, రోగులతో పొగాకు, పొగాకు ఉత్పత్తులు తాము కాని, తమ కుటుంబ సభ్యులం కాని వినియోగించమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్జీఓస్‌ అసోసియేషన్‌ గుడివాడ తాలూకా యూనిట్‌ అధ్యక్షుడు షేక్‌ ఫరీద్‌ బాషా, ఆసుపత్రి వైద్యులు, వైద్య ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

కూచిపూడి(మొవ్వ): మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా కూచిపూడి పంచాయతీ కార్యాలయం నుంచి ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు కలిసి ర్యాలీని నిర్వహించి పొగాకు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఖైనీ, గుట్కా, సిగరెట్‌ లాంటి పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడి జీవితాన్ని బలి చేసుకోవద్దని, పొగాకు క్యాన్సర్‌ కారకం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌ దాసరి శ్రీలక్ష్మి, హెచ్‌వీ విజయకుమారి, సీహెచ్‌వో కె.దివ్య, ఆరోగ్యకార్యకర్త కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

చావలిపాడులో ఉపాధి పనులు

మండవల్లి: మండలంలోని చావలిపాడు గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పనులు నిర్వహించారు. రూ.లక్షా 24 వేల అంచనా విలువతో 53 మంది ఉపాధి కూలీలు గ్రామంలో పంటబోదె పనులు చేశారు.

ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏపీఓ ఎన్‌.నవీన్‌ మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా గ్రామాలు అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. తాగునీరు, సాగునీటి సమస్యలు తీరుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ అసిస్టెంట్‌, మేట్‌లు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆకట్టుకున్న స్వామివార్ల అలంకారం



కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కృష్ణాపురం గ్రామానికి చెందిన కోట మురళీధర్‌ దంపతులచే అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకం కనులపండువగా నిర్వహించారు. 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేసి, కలశాలలోని జలాలతో స్వామివార్లకు అభిషేకాలు చేశారు. రాత్రికి ఆలయ కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలకు అంకుర్పారణ చేశారు. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించి, సంతానం కోరే మహిళలకు గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని గర్భాలయంలోని స్వామివార్ల మూలమూర్తులకు చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. రాజకీయ, ఆర్యవైశ్య, గ్రామ ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీపై అభాండాలు తగదు

కొల్లు రవీంద్ర తీరుపై మైనార్టీ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న సలార్‌దాదా, అచ్చెబా, ఉమర్‌ తదితరులు

మచిలీపట్నంటౌన్‌: నగరంలోని ఇంగ్లిషుపాలెం జెండా సెంటర్‌ వద్ద గత ఆదివారం ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణను వైఎస్సార్‌ సీపీకి ఆపాదించడం మాజీ మంత్రి కొల్లు రవీంద్రకు తగదని వైఎస్సార్‌ సీపీ మైనార్టీ నాయకులు అన్నారు. స్థానిక రామానాయుడుపేటలోని వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో మైనార్టీ విభాగం జోనల్‌ ఇన్‌చార్జ్‌ షేక్‌ సలార్‌దాదా మాట్లాడారు. పాత కక్షల నేపథ్యంలో యువకుల మధ్య తలెత్తిన ఘర్షణను వైఎస్సార్‌ సీపీకి, మసీదు కమిటీకి కొల్లు రవీంద్ర ఆపాదించడాన్ని తప్పుపట్టారు. మసీదు కమిటీ ప్రతినిధులకు ఈ ఘర్షణలో ఎలాంటి సంబంధం లేకపోయినా సంబంధం ఉన్నట్లుగా రవీంద్ర ఆరోపించారని విమర్శించారు. ప్రతి ఘటనకు వైఎస్సార్‌ సీపీని ఆపాదిస్తూ బురదజల్లే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌ షేక్‌ అచ్చెబా మాట్లాడుతూ రాజకీయాల కోసం ప్రతి ఘటనను ఉపయోగించుకోవడం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. జెండా సెంటర్‌ వద్ద జరిగిన వివాదాన్ని మసీదు వద్ద జరిగినట్లుగా కొల్లు రవీంద్ర ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. ఇంగ్లిషుపాలెం గౌసియా మసీదు అధ్యక్షుడు మొహమ్మద్‌ ఉమర్‌ మాట్లాడుతూ ఈ ఘటన మసీదు వద్ద జరగలేదని అయినా కొల్లు రవీంద్ర ఈ ఘటనలో తనపై కూడా దాడి చేసినట్లుగా ప్రచారం చేశారని, దీనిలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. వైఎస్సార్‌ సీపీ 15వ డివిజన్‌ ఇన్‌చార్జి మొహమ్మద్‌ రఫీ, వైఎస్సార్‌ సీపీ గ్రీవెన్స్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడు కరార్‌ మోసవి, కార్పొరేటర్‌ మీర్‌ అస్గర్‌అలీ పాల్గొన్నారు.

చెరువు తవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్తులు



చెరువు తవ్వకం పనులను అడ్డుకున్న గ్రామస్తులు

పెడన: ఉరివి గ్రామంలో రెండు ఎకరాల్లో చేపల చెరువు తవ్వకం పనులు ప్రారంభించగా పనులను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. దీనిపై భూ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పెడన ఎస్‌ఐ రవిచంద్రకుమార్‌ సిబ్బందిని పంపించి పనులు నిలిపివేయించారు. భూ యజమాని, గ్రామస్తులను స్టేషన్‌కు రావాల్సిందిగా సూచించారు. రైతులు మాట్లాడుతూ చెరువు తవ్వకం వల్ల చుట్టూ ఉన్న పంట పొలాలు దెబ్బతింటాయని, ఈ విషయాన్ని గతంలో మంత్రి జోగి రమేష్‌ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి పనులు నిలిపివేయించారని చెప్పారు. మంత్రి చెప్పినా వినిపించుకోకుండా పనులు చేయడం ప్రారంభించడంతో పనులను అడ్డుకున్నామని, రైతుల గోడు పట్టించుకోకుండా ఏ విధంగా అనుమతులు ఇస్తారంటూ రైతులు ప్రశ్నించారు. అన్ని అనుమతులు ఉన్నాయని, అందువల్లే చెరువు తవ్వకం పనులు ప్రారంభించామని సదరు యజమాని పోలీసులకు తెలిపారు. ఇరువర్గాల వారితో మాట్లాడామని, అనుమతులు పరిశీలించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవిచంద్రకుమార్‌ తెలిపారు.

డంపింగ్‌ యార్డును పూర్తిగా ప్రక్షాళన చేస్తాం

ఎమ్మెల్యే కొడాలి నాని



ప్రాసెసింగ్‌ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్‌: ఏళ్ల తరబడి చెత్త పేరుకుపోయి ప్రజలకు ఇబ్బందిగా ఉన్న పురపాలక సంఘ డంపింగ్‌ యార్డు పూర్తి ప్రక్షాళన చేస్తామని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక మున్సిపల్‌ డంప్‌యార్డులో ప్రైవేట్‌ సంస్థ ఏర్పాటు చేసిన లెగసి వేస్ట్‌ ప్రాసెసింగ్‌ యూనిట్‌ (డస్ట్‌ గ్రేడింగ్‌ మిషన్‌)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి పట్టణ జనాభా పెరగడం, దాంతో పాటు వ్యర్థాలు పెరగడంతో 4.8 ఎకరాల డంప్‌యార్డు పూర్తిగా నిండిపోయిందన్నారు. కొన్నిసార్లు వేసవిలో నిప్పంటించడం వలన పొగతో ఈ ప్రాంతం నిండిపోవడం, వర్షాకాలం కుళ్లి దుర్గంధం వెదజల్లడం వంటి ఇబ్బందులకు స్థానిక ప్రజలు గురయ్యారన్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.4 కోట్లు కేటాయించి ప్రక్షాళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సుమారు 50,930 మెట్రిక్‌ టన్నుల వ్యర్థాలు ఇక్కడ మేట వేసుకుపోయాయని అంచనా అని, వీటిలో ప్లాస్టిక్‌, గుడ్డపేలికలు, ఇనుము, గాజుపెంకులు, చెక్కముక్కలు, వివిధ దశల్లో బయటకు తీస్తారన్నారు. వీటిని జిందాల్‌ వంటి ప్రైవేట్‌ కంపెనీలకు తరలిస్తే వాటిని తిరిగి వినియోగంలోకి తెస్తారన్నారు. ఈ కార్యక్రమం మొత్తం 5 నుంచి 7 నెలల్లో పూర్తిచేసేలా అంగీకారం కుదుర్చుకున్నామని వాతావరణం అనుకూలిస్తే రోజుకు సుమారు 10 నుంచి 15 లారీల వ్యర్థాలు బయటకు తరలిస్తామన్నారు. ఇది పూర్తయిన అనంతరం ఒక ఎకరా డంప్‌ యార్డుకు కేటాయించి మిగిలిన 3 ఎకరాల డంప్‌ యార్డును అందమైన ఉద్యానవనంగా తయారుచేయడం తమ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ వి.మురళీకృష్ణ, అసిస్టెంట్‌ కమిషనర్‌ టీవీ రంగారావు, మున్సిపల్‌ ఇంజినీర్‌ (ఇన్‌చార్జ్‌) ప్రవీణ్‌కుమార్‌, వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నందివాడ మండలం వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ కొండపల్లి కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇదే చంద్రబాబు విజన్‌...

గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో డంప్‌యార్డు నుంచి దుర్గంధం వెదజల్లేది. డంప్‌యార్డుకు నిప్పు పెడితే టెలిఫోన్‌ నగర్‌ వాసులంతా పొగతో ఇబ్బందిపడుతున్నామంటూ చంద్రబాబు పర్యటనను అడ్డుకోగా వెంటనే స్పందించిన చంద్రబాబు నాయుడు గోడ కట్టండి సమస్య పోతుందని ప్రహరీ నిర్మించారన్నారు. ప్రహరీ నిర్మించినంత మాత్రాన దుర్గంధం, పొగ వ్యాప్తి ఆగుతుందా అని ఎమ్మెల్యే కొడాలి నాని ప్రశ్నించారు. ఇదే చంద్రబాబు నాయుడు విజన్‌ 2020 అని ఎద్దేవా చేశారు.

సజావుగా రిజిస్ట్రేషన్లు



మచిలీపట్నంటౌన్‌: స్థానిక రిజిస్ట్రార్‌ కార్యాలయంలో బుధవారం ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్లు సజావుగా సాగాయి. గత రెండు రోజులుగా సర్వర్‌ ఇబ్బందులతో ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్లు నిలిచాయి. దీంతో మంగళవారం మాన్యువల్‌గా రిజిస్ట్రేషన్‌ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. అయితే బుధవారం ఆన్‌లైన్‌ ఇబ్బందులు తొలగడంతో మచిలీపట్నం రిజిస్ట్రార్‌ కార్యాలయంలో ఏకంగా 170 రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీంతో గత రెండు రోజులుగా రిజిస్ట్రేషన్‌ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు రిజిస్ట్రేషన్‌ పూర్తవడంతో ఊపిరి పీల్చుకున్నారు. జూన్‌ 1వ తేదీ నుంచి నగరంలోని కోనేరుసెంటర్‌ నుంచి విజయవాడ జాతీయ రహదారికి ఇరువైపులా నగర, గ్రామాల పరిధిలో ఉన్న భూముల విలువ పెరుగుతున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్లకు కక్షిదారులు పెద్ద ఎత్తున తరలిరావడంతో కార్యాలయం వద్ద కోలాహలం నెలకొంది.

పోస్టుమార్టం చేసేందుకు నగదు డిమాండ్‌

కలెక్టర్‌ ఆదేశాలతో ఆర్డీఓ విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

మచిలీపట్నంటౌన్‌: సర్వజన ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు సిబ్బంది డబ్బులు డిమాండ్‌ చేయడంతో మృతుని కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌ ఆదేశాలతో ఆర్డీఓ బుధవారం విచారణ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... 42వ డివిజన్‌ బలరామునిపేటకు చెందిన ఎద్దు సత్యనారాయణ (50) మూడు రోజులుగా కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు అతని కోసం వెదకసాగారు. సత్యనారాయణ బైపాస్‌రోడ్డులోని మురుగుకాలువ వంతెన సమీపంలో ఉన్న బడ్డీ వెనుక కాలువలో పడి మృతిచెందాడు. బడ్డీ నిర్వాహకుడికి దుర్వాసన రావడంతో చుట్టూ పరిశీలించగా సత్యనారాయణ మృతదేహం కనిపించింది. విషయాన్ని వైఎస్సార్‌ సీపీ డివిజన్‌ ఇన్‌చార్జ్‌ చీలి చక్రపాణి దృష్టికి తీసుకువెళ్లాడు. సత్యనారాయణ మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం చేసేందుకు రూ. 10 వేలు వైద్యునికి ఇవ్వాలని ఆస్పత్రి అటెండర్‌ మృతుని కుటుంబ సభ్యులకు తెలిపాడు. అంత ఇవ్వలేమని కుటుంబ సభ్యులు సమాధానమిచ్చారు. బుధవారం మధ్యాహ్నం పోస్టుమార్టం చేయాల్సి ఉండగా ఎంతకూ వైద్యుడు రాలేదు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం తెలుసుకున్న వైద్యుడు వెంటనే వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు.

ఆర్డీఓ విచారణ..

జిల్లా కలెక్టర్‌ పి. రాజాబాబు, జాయింట్‌ కలెక్టర్‌ అపరాజితసింగ్‌ ఆదేశాలతో బందరు ఆర్డీఓ ఐ. కిషోర్‌ ఆస్పత్రికి వచ్చి ఈ ఘటనపై విచారణ చేశారు. మృతుడు సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఆర్డీఓకు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. దీనిపై వైద్యులు, సిబ్బంది నుంచి ఆయన వివరణ తీసుకున్నారు. అటెండర్‌ విచారణకు అందుబాటులో లేడని ఆర్డీఓ తెలిపారు. విచారణలో తహసీల్దార్‌ డి. సునీల్‌బాబు, ఆర్‌పేట ఎస్‌ఐ జి. వాసు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో నాగిరెడ్డి



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని వ్యవసాయ మిషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీఎస్‌ నాగిరెడ్డి దంపతులు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసి నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ, బాలకృష్ణ శర్మ, మణిదీప్‌ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి బర్మా ప్రసాద్‌ స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించి సత్కరించారు.

పేకాట శిబిరాలపై దాడులు

కంకిపాడు: పేకాట శిబిరాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. అదనపు ఎస్‌ఐ జె.లక్ష్మి కథనం మేరకు... కంకిపాడులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడి చేయగా నలుగురు జూదరులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.8 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరులో నిర్వహిస్తున్న మరో పేకాట శిబిరంపై నిర్వహించిన దాడిలో ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు.

క్లుప్తంగా

విద్యావేత్త మురళీమోహనరావుకు సన్మానం



అవనిగడ్డ: విద్యావేత్త కొండవీటి మురళీ మోహనరావుకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌ బాబు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బుధవారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దివంగత సింహాద్రి బసవయ్య వర్ధంతిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బసవయ్య స్మృతి జ్ఞాపికను మురళీ మోహనరావుకు అందజేసి సన్మానించారు. బసవయ్య మాస్టారు చేసిన సేవలను ఎమ్మెల్యే సింహాద్రి కొనియాడారు. హెడ్‌ పోస్టుమాస్టర్‌ సింహాద్రి రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ యువనేత సింహాద్రి వికాస్‌, నవజీవన్‌ విద్యాసంస్థల అధినేత కొండవీటి ఈశ్వరరావు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్‌ మద్ది చిన్నా, కాంట్రాక్టర్‌ సింహాద్రి లంకేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్‌ నూతన భవనాలు ప్రారంభం

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): పెదకమ్మవారిపాలెం, ఏటిమొగ గ్రామాల్లో కేడీసీసీ బ్యాంక్‌ నిధులతో నిర్మించిన పీఏసీఎస్‌ నూతన భవనాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌ బాబు గురువారం ప్రారంభిస్తారని సీఈఓలు కేవీ రామాంజనేయులు, విజయభాస్కర్‌ బుధవారం తెలిపారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌ తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షతన ఉదయం 8.09 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, జెడ్పీ చైర్‌పర్సన్‌ ఉప్పాల హారిక ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. కేడీసీసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారు.

వేట నిషేధాన్ని పాటించాలి



కోడూరు: వేట నిషేధాజ్ఞలను మత్స్యకారులు తప్పనిసరిగా పాటించాలని ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని పాలకాయతిప్ప, ఉల్లిపాలెం, విశ్వనాథపల్లి గ్రామాల్లో మత్స్య శాఖాధికారులు ఆకస్మికంగా పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం విధించిన వేట నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సత్యనారాయణ హెచ్చరించారు. మరో పదిహేను రోజుల పాటు నిషేధాజ్ఞలు కొనసాగుతాయని, మత్స్యకారులంతా సహకరించాలని సూచించారు. వేటకు అవసరమైన వలలను సిద్ధం చేసుకోవడంతో పాటు బోట్లకు మరమ్మతులు చేసుకోవాలన్నారు. అనంతరం బోట్ల వివరాలను అడిగి తెలుసుకుని, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీఎఫ్‌ఏ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ నియంత్రణపై కళాకారుల ప్రదర్శన



మచిలీపట్నంటౌన్‌: ఆంధ్రప్రదేశ్‌ కాలుష్య నియంత్రణ మండలి శాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్‌ వాడకంతో జరిగే నష్టాలను వివరిస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సింగిల్‌ యూజ్డ్‌ ప్లాస్టిక్‌ వాడకం వల్ల జరిగే అనర్థాలపై అమరావతి కల్చరల్‌ ఆర్గనైజేషన్‌ గుడివాడ కళా బృందం సభ్యులు ప్రదర్శనలు ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రదర్శనలో వివరించారు. నగరంలోని గాంధీ బొమ్మ శివాలయం సెంటర్‌, నాగపోతరావు సెంటర్‌, మార్కెట్‌ సెంటర్‌లో కళా జాతా ప్రదర్శన ఇచ్చారు. ప్రదర్శనలో కళాకారులు వీరయ్య, రవిజేత పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి లక్ష మల్లెలతో అర్చన

ముదినేపల్లిరూరల్‌: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష మల్లెలతో అర్చన బుధవారం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి 11మంది రుత్వికుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష మల్లెలతో అర్చన కనుల పండువగా జరిపారు. ఆలయ చైర్మన్‌ కొంతి నాగరాజు, సహాయ కమిషనర్‌ నేల సంధ్య, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ప్రముఖుడు వంగా శ్రీనివాసరావు (వంశీ), ఆనందదాసు శివ నాగేంద్ర పాల్గొన్నారు.